# అమ్మకథ

## సదానంద శారద

రిక్షా సార్... రిక్షా..

వొద్దు పోవయ్యా — నా బతుక్కి ఇంకా రిక్షాలో వెళ్ళే దర్జానా!! — ఎక్కడికి పోవాలె సారూ? — నీకెందుకు... ఎక్కడికో పోతా —ఏట్లోకి... టైమెంత సారూ?... నా దగ్గర వాచీ లేదని తెలిసే కదా... వీడి వేళాకోళం... అందర్నీ అలా విసుక్కుంటావేం — ఫుల్ స్లీవ్స్ షర్ట్ వేసుకున్నావ్ — నీ చేతికి వాచీ వున్నది, లేనిది అతనికేం తెలుసు?... సారీ బ్రదర్ — వాచ్ రిపేర్ కిచ్చాను — నిజంగావే — కుదువబెట్టలేదు — నిజం... — రిపేరింగ్ చార్జీలు లేక తేలేదు — ముట్టుకుంటె ముప్పైలు, వలభైలే!.... పొద్దున ఇంటి ఓనర్ అల్టిమేటం ఇచ్చాడు — ఇవ్వడూ మరి — మూడు నెల్ల అద్దె బాకీ — వూర్కుంటాడా — సామాన్లు వీధిలో పెట్టిస్తానన్నాడు... సాంబశివం పిడుగు మాటలు మాత్రం తక్కువా — చిట్టీ కట్టాలి — తీసుకున్న అప్పు మీద వడ్డీ కట్టాలి — కట్టని చిట్టీ డబ్బులు, వడ్డీ, అప్పు మొత్తానికి కలిపాడు — కలుపుతున్నాడు — పదివేలను ఇప్పటికి ముప్పై వేలు చేశాడు -- ఏం చేద్దాం తప్పు మనది — అప్పు నిప్పని తెలిసినా తప్పలేదు మరి!

ఓ ఇల్లు కట్టుకోవాలని కలలు కనడం నేను చేసిన ఘోరమైన తప్పు — కలలు కన్నాను పో — చిట్‌ఫండ్‌లో ఎందుకు చేరాలి — చేరాను పో — శనిగాడు నా వెంట తుమ్మజిగురు అంటించుకొని ఎందుకు తిరగాలి!

పార్ట్‌నర్స్ గొడవలు పడి చిట్‌ఫండ్ కంపెనీ మూసేసారా — ఇరవై వేలు మునిగాయి — ముంచడానికే గొడవలు నటించారేమో — జనాన్ని ఎవడి ట్రిక్కులతో వాడు దోచుకుంటున్నాడు — ఆ మాటకొస్తే దొంగతే నయం — డైరెక్ట్‌గా దోచుకుంటారు — ఈ చిట్‌ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ కార్పొరేషన్లు... కిరాణా కొట్లు, మందుల కొట్లు... మేడిపండ్లు — నాయకులు మాత్రం తక్కువ తిన్నారా... జనం రక్తాన్ని జుర్రుకుంటున్నారు... ఎలక్షన్ల ముందు ఎంత నటనో... నక్కవినయాలో!!... గెలిచారో నాలుగు చేతుల దోచుకునుటే— మనిషికి వుండేవి రెండు చేతులేగా భాయ్!... వాడివి వాని భార్యవి — కాకపోతే వాని బామ్మర్దివి — కొడుకువి... ఎన్నెన్ని చేతులు తొడుక్కుంటారో జనాన్ని దోచుకోడానికి... ఉహ్... హ్... అలా వొణుకుతావేం? —చలి... ఈసారి చలి ఎక్కువే... ఎముకల్ని కొరికే చలి... ఓ వెచ్చని స్వెట్టర్ కొనుక్కునే అదృష్టమా! అన్ని డబ్బులు చేతిలో వుంటే వాచీ ఎందుకు తెచ్చుకోను? — రిపేరింగ్ వాడు అక్కడికి అననే అన్నాడు పిలిచి మరీ చెప్పాడు — వాచ్ తీసుకపోండి సార్... రిపేరయింది అని — ఆ రూట్లో నడవడం మానేశాను.

బస్‌స్టాప్‌లన్నా, బస్సులన్నా ఎలర్జీ పట్టుకుంది — పాస్ రేట్లు పెంచిరి — టికెట్ రేట్లు పెంచిరి — ఆయిల్ ధర పెరిగిందని పెంచిరి — గల్ఫ్ యుద్ధమని పెంచిరి — గల్ఫ్ యుద్ధం తరువాత? ఏం జరిగింది — పెంచిన రేట్ల మాటే మరిచిరి! అడిగే నాథుడు 'లేడు — జనానికి ఎవరి ఈతిబాధలు వారివి!

పాత స్వెట్టర్ ఎక్కడో వుండాలి — కుట్లూడిపోయింది... భుజాలనిండ చిరుగులు పడింది... ఎలుకలు కొరికేశాయ్ — పేదవాడి సొమ్మంటె వాటికీ పండుగే — .... చలి... ఉహ్‌హ్...: వేళ్ళు కొంకర్లు పోతున్నాయి.

బస్సులో పోతే ఈపాటికి ఇంట్లో ఉందును... కాని ఇంటి ఓనర్ అల్టిమేటం ఇచ్చాడే... సాంబశివం వొస్తాడే!!... భార్య పురిటికి పుట్టింటికి పోయింది... ఏ మాటకామాటే..: ఇటువంటి విషయాల్లో ఆచారాలను కళ్ళకు అద్దుకొని ఆచరించాలి... ఇక్కడే పురుడంటే మళ్ళీ సాంబశివం దగ్గర అప్పు!... వడ్డీ పెరిగే వడ్డీ!!

అమ్మ ఒక్కతే వుంది ఇంట్లో — వారంరోజులు గడువుంటె బాగుండు — కొంతకాకపోతే కొంతైనా సర్దుకోవచ్చు — కిరాయి రెండు నెలలది కడదాం అనుకున్నానా... పి.బి.శ్రీనివాస్ పాట కరెక్ట్.... తలచినదే జరిగినదా దైవం ఎందులకు?... కొలీగ్ రాజోలు వున్నాడు కదా... నాలుగొందలు చేబదులు ఇచ్చి... ఏడొందలైందని జీతం రాగానే గుంజుకున్నాడు. పరువు పోతుంది — అందులో సాటి ఉద్యోగుల ముందని... తలవొంచేసి ఏడొందలు రాజోలుకు వొదులుకున్నానా... ముసల్దాన్ని అర్జెంటుగా ఆసుపత్రిలో చేరిస్తే వూరికెనే అవుతుందా... తల్లిని ముసల్ది గిసల్ది అనటం తప్పు కదోయ్... తల్లి ఆసుపత్రిలో పడిందనే పేరుతో అప్పు చేశావు కాని... అసలు ఆసుపత్రికి అయిన ఖర్చెంత? పాతిక రూపాయలు... ప్రభుత్వ ఆసుపత్రి కదా — అప్పుడప్పుడు మంచి డాక్టర్లు తగలకపోరు... మిగతా డబ్బు కిరాణా కొట్లో కట్టుకున్నావు కదా... నిజమే. చేతికి వొచ్చే జీతం కిరాణా కొట్టుకే సరిపోదు — గొర్రెతోక బెత్తెడని — ఇటు సర్దితే అటు సరిపోదు— అటు సర్దితే ఇటు సరిపోదు — దుప్పటి వున్నంత మేర కాళ్ళు చాపుకోడం చేతకాదు — అస్సలు కుదరదు — మరి రాజోలు అప్పులు ఎట్ల ఇస్తున్నాడు?... అది అతగాడి సంపాదన మిగులా?... తాతల్నించి, అత్తగారింటి నుంచి వొచ్చింది... తొక్కుడు పైసా సాయంచేసి పది పైసలు గుంజుకోగలడు... భగభగమండే రు॥ ధరలొహాటీ ప్రాణాలు తోడేస్తున్నాయి... న్యూస్ పేపర్ లగ్జరీ అయిపోయాక ఇక బతకడానికి మిగిలేదేమిటి... బూడిద — పెరిగే కూరగాయల ధరల్ని తలుచుకుంటె — అడవుల్లోకి పారిపోయి ఆకులు, అలములు తిని బతకడం మేలు అనిపిస్తుంది. అక్కడా వో వేకెన్సీ — మళ్ళీ అప్పు చేయాలంటె భయం — గుండెలో వాడి బాకు దిగినంత గుబులు — అయినా ఇవ్వరు కూడా — ఇవ్వడానికి నేనే దొరికానా! మూర్తిలాంటి సహృదయులు చేతనైనంత సహాయం చేశారు — వాళ్ళను మళ్ళీ అడిగితే బాగుండదు — అప్పుడంటె అమ్మ ఆసుపత్రిలో వుందని తెలిసి సానుభూతితో అడగకముందే 'డబ్బులేవన్నా సర్దాలా' — అని చేతిలో పెట్టారు.

ఇప్పుడు కూడా... ముసల్ది మళ్ళీ ఆసుపత్రిలో పడితే బాగుండు... అప్పు పుట్టినా పుట్టకున్నా...

**ఇప్పుడు కూడా... ముసల్ది మళ్ళీ ఆసుపత్రిలో పడితే బాగుండు... అప్పు పుట్టినా పుట్టకున్నా... 'పీకల మీద కూర్చున్న వాళ్ళన్నా కొద్ది రోజులు ఆగుతారు— తల్లి ఆసుపత్రిలో వుందని... పీడించేవాళ్ళు వెనకడుగు వేస్తారు.**

పీకల మీద కూర్చున్న వాళ్ళన్నా కొద్ది రోజులు ఆగుతారు— తల్లి ఆసుపత్రిలో వుందని... పీడించే వాళ్ళు వెనకడుగు వేస్తారు — కాస్త వూపిరి పీల్చుకోవచ్చు...

ఎంత హీనాతిహీనంగా ఆలోచిస్తున్నావ్! ఎంత పతనమైపోయావ్! దయ, దాక్షిణ్యం... ప్రేమ, అభిమానం... వాత్సల్యం అడుగంటాయా? బతుకులో మిగిలిన ఆ కాస్త మాధుర్యాన్ని సంక్లిష్ట పరిస్థితులు పిల్చిపిల్చి పిప్పి చేస్తున్నాయి! అప్పుల వాళ్ళు ఆగడం కోసం కన్నతల్లి ఆసుపత్రిలో పడితే బాగుండు అని కోరుకుంటున్నావా!!... మైల పడినదోయి నీ మనుష జన్మ... నీ వంటి కొడుకును కన్న ఆ తల్లి ఎంతటి దురదృష్టవంతురాలు!!... నిన్ను పది నెలలు మోసి... కని... పెంచి పెద్ద చేసిందే... నీ కాలికి ముల్లు నాటితే ఆమె కంటికి నీరొచ్చిందే.... నీకు ఒళ్ళు వెచ్చనయితే ఆమె ప్రాణం గిలగిల్లాడేది... నువ్వు బడి నుంచి ఇంటికి ఆలస్యంగా వొస్తే గడపలో ఘంచొని... నీ రాక కోసం అన్నం తినకుండా, నీళ్ళు ముట్టకుండా ఎదురుచూసేది... ఆ రోజుల్ని మరచిపోయావా?... చివరికి నీ పెళ్ళాం చదువుకున్నది కదా... అత్తకు సేవలు చేయకున్నా నొచ్చుకున్నదా? సర్దుకపోయింది. తన భాషను వెక్కిరించినా కొడుకు బాధపడ్తాడని పల్లెత్తు మాటనలేదు... నీకు చెప్పుకోలేదు...

చిన్నప్పుదు నువ్వు కబడ్డీ ఆడి మోకాలికి గాయం చేసుకుంటె తన గుండెకే గాయం అయినంత తల్లడిల్లింది నీ తల్లి — ఆసుపత్రికి ఎత్తుకపోయి కాలుకు పట్టి కట్టించి వారంరోజులు... నొప్పి తగ్గేదాకా నిన్ను ఎత్తుకొని తిరిగింది... నీకు గజ్జిపుళ్ళు లేస్తె ఎంత ఓపిగ్గా మందులు రాసి, కొబ్బరి నూనె రాసి సేవ చేసింది!... నీకు కడుపునొప్పి లేచి పక్షిలా కొట్టుకుంటే పేరు పేరున దేవుళ్ళను తలచుకొని వేడుకున్నదే... వేములవాడ రాజన్నకు, మేడారం సమ్మక్కకు ముడుపులు కట్టిందే... కొడుకా ఎట్లున్నది కొడుకా అని మంచం విడువకుండా దగ్గర కూర్చున్నదే... ఆ తల్లినేనా... నీ అప్పులవాళ్ళు ఆగడం కోసం ఆసుపత్రి పాలుకావాలని కోరుతున్నావ్!! ఏమైపోతున్నది ఈ తరం? ఎటుపోతున్నది ఈ దేశం?

నమస్తే పెంటన్నా... ఎవడ్రా వీడు... నా అసలు పేరు వీడికెట్లా తెలుసు... ఓహ్ నువ్వా భిక్షపతి... ఆ... ఏందో బాగ సోంచాయించుకుంట నడుస్తు వస్తున్నా...అంతా మంచేనా!... ఆ... ఏం లేదు... ఏం లెదు తమ్మీ... ఇట్ల ఏడికి పోతానవన్నా?... ఇంటికి దగ్గరి దారి అని నడిచొస్తుంటె వీడు ఎదురయ్యాడేవిటి!

ఈ నెల బస్‌పాస్ తీసుకోలేదనే కదా ఇంతమంది కలిసేది... ఆఫీసు నుంచి ఇంటికి నడిచిపోతున్నా అనుకోరూ?... గీద జెరంత పనుండె తమ్మీ...



వొస్తా... మంచిదన్నా... తొందర్ల ఉన్నట్టున్నవ్...

ఇంకెవరన్నా కలిస్తే ప్రమాదం... తలెత్తను... గబగబ... గబగబా నడు... గబగబా... హమ్మయ్య ఇల్లు వొచ్చేసింది... అటూ ఇటు చూడకుండా ఇంట్లో దూరేయ్...

"ఇంత ఆలిశం అయిందేం కొడుకా..."

"ఆ... పనుండె..."

అదేవిటి తల్లి చేతిలో... స్వెట్టర్! నా పాత స్వెట్టరే కదూ... అవును...

"నీదే బిడ్డా... సలిల తిరగబడ్తివి అని తీసి కుడ్తాన..."

"అమ్మా..."

"ఏంది బిడ్డా..."

"అమ్మా..."

"గిట్ల కాళ్ళమీన పడ్తానవేంది కొడుకా.... ఏమైంది బిడ్డా?..."

"నన్ను... నన్ను క్షమించమ్మా... నన్ను క్షమించు... నేను మూర్ఖుణ్ని... నేను పాపాత్ముణ్ని... నేను రాక్షసున్నమ్మా... నన్ను శిక్షించు... నీ ఇష్టం వచ్చినట్లు శిక్షించు..."

"కొడుకా... ఏంది నాయినా?"

"నన్ను... నన్ను నీ కాలి చెప్పుతో కొట్టమ్మా...

నన్ను శిక్షించు... నన్ను శిక్షించమ్మా... ఏ తల్లి ఇలాంటి కొడుకును కనకూడదమ్మా..."

"లే బిడ్డా... నువ్వేం తప్పు చేసిన కడుపుల పెట్టుకుంట బిడ్డా... గట్లనకు కొడుకా... లే... నువ్వు బాదపడ్తె... చూడలేను కొడుకా..."

*